నెల్లికుదురు: ఎస్‌బీఐలో వేచి చూస్తున్న రైతులు

రైతులకు తీరని రుణమాఫీ తిప్పలు

- రెన్యువల్ కోసం రోజుల తరబడి తిప్పతున్న బ్యాంకు అధికారులు
- తీరు మార్చుకోవాలని సూచన

నర్సింహులపేట/ నెల్లికుదురు, సెప్టెంబర్ 10: నెల రోజుల క్రితం ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించినా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు తిప్పలు తప్పడం లేదు. రోజుల తరబడి తిరిగినా, గంటల కొద్దీ ఎదురు చూసినా.. ఆడిట్ పేరుతో 20 రోజుల పాటు రైతులకు ఎలాంటి బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయకపోవడంతో పాటు ప్రస్తుతం రెన్యువల్ చేసేందుకు తిప్పలు పెడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నుంచి నేటి వరకు తీసుకున్న లోన్‌కు వడ్డీ చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందనే బ్యాంకు అధికారుల నిబంధనల ప్రకారం రైతులు వడ్డీ చెల్లించేందుకు బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఇచ్చిన పత్రాలు బ్యాంకు అధికారులు పోగొట్టడంతో ఒక్కో రైతు 2, 3 సార్లు సమర్పించాల్సి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. దళారులకు మాత్రమే పనుల చేస్తున్నారని, దీంతో రేపు మాపు అంటూ రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ నెల రోజులకు రమ్మన్నరు..

నాకు నెల రోజుల క్రితం రుణమాఫీ అయినట్లు లిస్టులో పేరు వచ్చింది. దీంతో బ్యాంకుకు వస్తే 10 రోజుల తర్వాత రమ్మన్నారు.10 రోజుల తరువాత వస్తే 'అడిట్ అవుతుంది. తర్వాత రమ్మన్నారు. ఇట్లా నాలుగు సార్లు రమ్మన్నరు. ఈ నెల 4న వస్తే మంగళవారం రమ్మన్నరు. ఇప్పుడు నెల రోజుల తర్వాత రమ్మంటున్నారు. రుణమాఫీ రెన్యూవల్ కోసం తిప్పలు పెడుతున్నారు.

–ముక్కెర శ్రీనివాస్, రైతు, జయపురం

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నిత్యావసరాలు అందజేస్తున్న ఐలయ్య, సంస్థ సభ్యులు

బయ్యారం, సెప్టెంబర్ 10: వర్షాలకు ఇండ్లు కూలిపోయిన బాధితులకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీసెస్ (ఆర్‌డీఎస్‌ఎస్), రైతు స్వరాజ్య వేదిక (ఆర్‌ఎస్‌వీ) సహకారంతో పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మంగళవారం నిత్యావసర సరుకులు, చద్దర్లు, చీరెలు అందజేశారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య, సొసైటీ మాజీ చైర్మన్ భిక్షం, పీవోడబ్ల్యూ కార్యదర్శి పద్మ, మధు, నాగేశ్వరరావు, రాకేశ్ పాల్గొన్నారు.

బురదమయంగా గూడూరు బస్టాండ్

- బస్సులు సరిపడా లేక ఇబ్బందుల్లో ప్రయాణికులు
- హైదరాబాద్‌కు సర్వీసులు పెంచాలని వేడుకోలు

బురదమయంగా ఉన్న బస్టాండ్ ప్రాంగణం

గూడూరు, సెప్టెంబర్10: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ బురదమయంగా మారింది. బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు, బస్సు సర్వీసులు సరిపడ లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 6నెలల క్రితం పునఃప్రారంభమైన ఆర్టీసీ బస్టాండ్ చినుకు పడితే చిత్తడిగా మారుతున్నది. మండల ప్రజలు బురదను చూసి బస్టాండ్‌కు రావాలంటే జంకుతున్నారు. కొన్నిరోజుల క్రితం బస్టాండ్‌లోని ఔట్‌గేట్‌లో మరుగుదొడ్ల పైపులైన్ పగిలి పోవడంతో మురుగు నీరు బయటికి వస్తున్నది. దీంతో బస్సులు అటునుంచి వెళ్లడం లేదు. బస్టాండ్ ప్రాంగణమంతా బురదగా మారింది. బస్టాండ్‌లో కనీస తాగునీరు, స్టాల్ సౌకర్యం కూడా లేదు. ఇక్కడి నుంచి నర్సంపేట, మహబూబాబాద్, కొత్తగూడ, నెక్కొండ, కేసముద్రం వైపు నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వెళ్తుంటారు. బస్సు సర్వీసులు సరిపడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని, ఉదయం 5.30 గంటలకు హైదరాబాద్‌కు బస్సు సర్వీసులు అసలే లేవని, కొన్నేళ్లుగా బంద్ కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సర్వీసును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గంట్లకుంట ప్రభుత్వ పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయుడు

ఐదుగురున్నా.. ఒక్కరే హాజరు

- సమయానికి రాని ఉపాధ్యాయులు
- ఇబ్బందులు పడుతున్న గంట్లకుంట పాఠశాల విద్యార్థులు

పెద్దవంగర, సెప్టెంబర్ 10 : ఆ పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులున్నా ఒక్కరే హాజరయ్యారు. మిగతా వారు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తరగతి గదుల తాళాలు తీయకపోవడంతో వరండాలోనే పడిగాపులు పడుతున్నారు. ఇది మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి. మంగళవారం స్థానికంగా ఉండే ఉపాధ్యాయుడు మాత్రమే హాజరై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మిగిలిన నలుగురు సుదూర ప్రాంతాల నుంచి అప్‌అండ్‌డౌన్ చేస్తుండడంతో సమయానికి రాలేదు. తరగతి తాళం చెవులు కూడా వారి వద్దే ఉండడంతో వచ్చే వరకు బయటే వేచి చూశారు. ఇది ప్రతిరోజూ జరుగుతున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు పాఠశాల ఆవరణంతా చెత్తాచెదారం, బురదతో నిండిందని, నీటి సంపుతో పాటు చేతులు శుభ్రం చేసుకునే ప్రాంతం అపరిశుభ్రంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మరిపెడ: మండలంలోని పరకాజల్‌తండా, లోక్యతండా, ఉల్లెపెల్లి తండాల్లో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవికుమార్ మాట్లాడారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు స్వామి, అఖిల, పద్మ, చంద్రకళ, విజయ, తులసి ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

గోపా(ఫైల్)

కురవి(సీరోలు), సెప్టెంబర్ 10: చికిత్స పొందుతూ రైతు మృతిచెందిన ఘటన సీరోలు మండలంలోని రేకులతండాలో జరిగింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన తేజావత్ గోపా(65) ఈనెల 8న పొలం వద్దకు వెళ్తూ ప్రమాదవశాత్తు కాలు జారి నీటి గుంతలో పడిపోయాడు. ఊపిరందక గోపా కేకలు వేయగా విన్న తమ్ముడు సేల్రాం బయటకు తీసి మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి మృతిచెందాడు. గోపా కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్స్యకార్మికులను ఆదుకోవాలి

తొర్రూరు, సెప్టెంబర్ 10: వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన మత్స్యకార్మికుల ఆర్థిక పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉన్నదని ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ నాయకులు మాట్లాడుతూ వర్షాలతో చెరువులు తెగి రూ.13.75కోట్ల నష్టం జరిగిందని, పెద్ద మనసుతో తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సమదేవ్, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటార్ కొత్తూరు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల సోమయ్య, కార్యదర్శి దుంపల వెంకట్రాములు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో గంటల కొద్దీ బారులు



పెట్రోల్ కోసం బారులుదీరిన వాహన దారులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: పట్టణంలోని ఇల్లందు రోడ్, ఈదులపూసపల్లి, జమాండ్లపల్లి, శనిగపురంలో ఉన్న పెట్రోల్ బంకులు లోతట్టులో ఉండడంతో వర్షానికి నీరు చేరింది. ఈ క్రమంలో వాహనదారులు పెట్రోల్‌లో నీళ్లు కలిసి వస్తున్నాయని ఆందోళనతో కొన్ని బంకుల్లో పెట్రోల్ పోయించుకోవడంలేదు. బస్టాండ్ ఏరియాలో ఇండియన్ పెట్రోల్ బంకు ఒకటి మాత్రమే పనిచేయగా, అందులో కూడా సాంకేతిక సమస్య రావడంతో మంగళవారం రాత్రి వాహనదారులు పెట్రోల్ కోసం బారులు తీరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శిబిరాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

డోర్నకల్, సెప్టెంబర్ 10: మోదుగుగడ్డ తండా, ముల్కలపల్లి, దుబ్బగడ్డ తండాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు, డీఐవో డాక్టర్ లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వరద బాధిత కుటుంబాలకు ఎలాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వర బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డాక్టర్ కనకదుర్గ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

కురవి, సెప్టెంబర్ 10: కోతుల దాడిలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన కురవిలో మంగళవారం జరిగింది. మోసం వీరమల్లమ్మ స్నానం చేసేందుకు వెళ్లిన క్రమంలో కోతుల గుంపు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పక్కింటివారు వచ్చి చెదరగొట్టారు. వెంటనే కురవి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అనంతరం మహబూబాబాద్ ఏరియా దవాఖాకు తీసుకెళ్లారు. కోతులు, వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయంభయంగా జీవిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ

కేసముద్రం, సెప్టెంబర్ 10: మండలంలోని జమలాపురం కాలనీకి చెందిన ఈదుల కొమురయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ మంగళవారం 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అశోక్, సాయి, కొండేటి కళాధర్, పబ్బతి ప్రశాంత్, బాలు, విజయ్, నితిన్, కల్యాణ్, దేవ, భిక్షపతి, లావణ్య, పద్మ ఉన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 10: పట్టణంలోని 22, 23వ వార్డుల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బీ అజయ్‌సారతి అన్నారు. మంగళవారం ఆయా వార్డులను వారు సందర్శించి మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమై కంకర తేలిందన్నారు. పలు చోట్ల కల్వర్టులు సైతం దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు.

ఓటుకు నోటు ఇవ్వొద్దంటూ ఫ్లెక్సీ ఏర్పాటు

బిచ్చానాయక్ తండాలో వెలసిన ఫ్లెక్సీ

కేసముద్రం, సెప్టెంబర్ 10: గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్నందున రాజకీయ నాయకులు ఓటుకు నోటు ఇవ్వొద్దంటూ బిచ్చానాయక్ తండాలో మంగళవారం వాల్ పోస్టర్లు వెలిశాయి. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ప్రజలకు మందు తాగించి తాగుబోతులను చేయవద్దని, ఓటుకు నోటు ఇవ్వొద్దని సూచించారు. నిజాయితీగా రాజకీయాలు చేసుకోవాలని కోరారు. డబ్బులు ఖర్చు చేయాలని అనిపిస్తే గ్రామంలో ఏదైనా మంచి పని చేయాలని సూచించారు. ఈ వాల్ పోస్టర్లు గ్రామ కమిటీ కుర్రాళ్ల పేరుతో ఏర్పాటు చేశారు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పోలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పోలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన ఠాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. ఠాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమాచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తల నొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని న్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

రిజర్వేషన్లు రద్దు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం

కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన హత్యాచార ఘటనపై నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. మంగళవారం ఐదు గంటల్లోపు విధుల్లోకి చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. 32వ రోజైన మంగళవారం కూడా విధులు బహిష్కరించి తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు, సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానించారు. దీనిని జూనియర్ డాక్టర్లు తిరస్కరించారు.

నాలుగేండ్లు ఏం చేశారు?

మలయాళ సినీ పరిశ్రమలో మహిళల వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్య తీసుకోకుండా స్తబ్దుగా, నిష్క్రియాత్మకంగా ఉండటం పట్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నివేదిక ఇచ్చిన నాలుగేండ్ల తర్వాత మాత్రమే చర్యలు ప్రారంభించిందని, ఇన్నాళ్లూ ప్రభుత్వం ఏం చేసిందనిజస్టిస్‌లు ఏకే జయశంకరన్ నంబియార్, సీఎస్ సుధాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వెంటనే కమిటీ పూర్తి నివేదికను (సిట్)కు అప్పగించాలని ఆదేశించింది

హేమ కమిటీతో ఆదర్శం: పినరయి

దేశంలోని ఏ రాష్ట్రం చేయని విధంగా చలన చిత్ర పరిశ్రమపై వచ్చిన ఆరోపణలపై తమ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని వేసి ఆదర్శంగా నిలిచిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు.

ఇ